క్లుప్తంగా

వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలి

తిరువూరురూరల్: వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు బుధవారం కోకిలంపాడు, అక్కపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ప్రధాన వీధుల్లో ప్రచార రథంపై నుంచి మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ సంక్షేమ పథకాల అందించిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలనికోరారు. నాయకులు ఏసురత్నం, వెంకటనరసమ్మ, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సహకార సేవలు సద్వినియోగం చేసుకోండి



తిరువూరురూరల్: సహకార కేంద్ర బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. మండలంలోని చిట్టేలలో రూ.40 లక్షలతో నిర్మించిన గోదాములను ఆమె బుధవారం ప్రారంభించారు. 500 మెట్రిక్ టన్నుల గోదామును రైతుల అవసరాలకు నిర్మించామని, సొసైటీ ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల సాధనకు ఐక్యంగా ఉండాలి

గంపలగూడెం: బీసీలు సమస్యల సాధనకై ఐక్యంగా పోరాడాలని ఎన్టీఆర్ జిల్లా వెనుకబడిన తరగతుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల వెంకట్ తెలిపారు. ఏపీ బీసీ సంఘం గంపలగూడెం మండల శాఖ అధ్యక్షుడు యాసారపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం గంపలగూడెంలో బీసీల ఐక్యత ర్యాలీ నిర్వహించారు. వెంకట్ మాట్లాడుతూ బీసీల ఆర్థిక అభివృద్ధికై సంక్షేమ పథకాలను చేపట్టాలన్నారు. శివశంకర్, తిరువూరు, ఏ.కొండూరు మండలాల అధ్యక్షులు ఎం.వెంకటరమణ, నీలపాల తిరుపతిరావు, ఎస్టీ నాయకులు భూక్య నాగరాజు, బీసీలు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మైలవరం: వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు స్థానిక ఆర్‌సీఎంచర్చి పెద్దలు, పాస్టర్ అనిల్‌కుమార్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పాస్టర్ అనిల్ కుమార్ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని, అభ్యర్థి విజయాన్ని ఆంకాంక్షిస్తూ ప్రార్థనలు చేసి, ఆశీర్వదించారు. సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి, నాగులూరిదుర్గాప్రసాద్, స్వామిదాస్ పాల్గొన్నారు.

వేణుగోపాలుని సేవలో ఏసీపీ దంపతులు



గంపలగూడెం: నెమలి శ్రీ వేణుగోపాలస్వామిని మైలవరం ఏసీపీ ఎస్ మురళీమోహన్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో ఏసీపీ దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు ఆశీర్వదించారు. త్వరలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో స్వామి కల్యాణోత్సవం నిర్వహించే ప్రాంగణాన్ని ఏసీపీ పరిశీలించారు. ఏర్పాట్లపై సహాయ కమిషనర్ ఎస్‌వీ సాంబశివరావుతో చర్చించారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- విజయవాడ ఎంపీ కేశినేని నాని
- అభిమానుల కేరింతల మధ్య వైఎస్సార్ విగ్రహావిష్కరణ
- వైఎస్సార్ సీపీ కార్యాలయాలు ప్రారంభం



గుంటుపల్లిలో వైఎస్సార్ విగ్రహం ఆవిష్కరించిన ఎంపీ కేశినేని నాని, తిరుపతిరావు తదితరులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజల ఉత్సాహం చూస్తుంటే మైలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమైందని విజయవాడ ఎంపీ కేశినేని నాని అన్నారు. ఇటీవల కాలంలో ఇబ్రహీంపట్నం నుంచి మైలవరం వరకు నిర్వహించిన ర్యాలీలో పోటెత్తిన ప్రజల ఉత్సాహమే విజయానికి నిదర్శనం అన్నారు. గుంటుపల్లిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావుతో కలిసి బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహంతో పాటు గ్రామంలో ఏర్పాటు చేసిన మూడు వైఎస్సార్ సీపీ కార్యాలయాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నందిగామ నుంచి వలస వచ్చిన నాయకులు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారన్నారు. గుంటుపల్లిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.1.50 కోట్లు గతంలో తాను మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి వచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఏమీ చేయలేరన్నారు. పవన్ కల్యాణ్ టీడీపీకి జనసేన పార్టీని తాకట్టు పెట్టాడన్నారు. రాష్ట్రంలో 1.65 కోట్ల కుటుంబాలు ఉంటే 1.35 కోట్ల కుటుంబాలకు సంక్షేమం అందిందన్నారు. ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న పథకాలతో ప్రజల ముందుకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇంటి పట్టా పొంది తన కల నెరవేరిందని చెప్పిన గీతాంజలి అనే మహిళ చావుకు టీడీపీ సోషల్ మీడియా కారణమైందని విమర్శించారు. ఎంపీ కేశినేని నాని టాటా ట్రస్ట్ ద్వారా పేదలకు అందించిన సేవలు నేటికీ ప్రజలు మర్చిపోలేదని తెలియజేశారు. నియోజకవర్గంలో వర్గాలు లేవని అంతా జగన్‌మోహన్‌రెడ్డి వర్గంగా ఉన్నామన్నారు. పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కార్యకర్తలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సీనియర్ నాయకలు గోగినేని సాంబశివరావు, సాయి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, బొంతా సాంబశివరావు, పోతురాజు, కోసూరు వెంకటేష్, జిల్లా నాయకుల శివశంకరరావు, సీహెచ్ కోటేశ్వరరావు, నల్లమోతు సుభాష్, బోసు, చింకా శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు
- పీఏసీఎస్ భవనం ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, కేడీసీసీబీ చైర్‌పర్సన్



ఏఎంసీ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న కంబాల కృష్ణవేణి, వేదికపై ఎమ్మెల్యే

నూజివీడు: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలో రూ.62 లక్షల వ్యయంతో నిర్మించిన పీఏసీఎస్ నూతన భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 40 వేల మంది రైతులకు రైతుభరోసా పథకం ద్వారా నిధులు వచ్చాయన్నారు. గత డిసెంబర్‌లో తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద ప్రభుత్వం 325 మంది రైతులకు రూ.1.86 కోట్లను అందించిందన్నారు. కేడీసీసీబీ చైర్మన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ పీఏసీఎస్‌ల ద్వారా రూ.40 లక్షల వరకు హౌసింగ్ రుణాలను ఇస్తున్నామన్నారు. మహిళలకు రూ.1.06 కోట్ల రుణాలను అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ బొబ్బిలి సాయిబాబా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, విద్యామౌలిక సదుపాయాల సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, కేడీసీసీబీ డైరెక్టర్లు సుజాత, రాణా, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, ముసునూరు వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, తుక్కులూరు వైఎస్సార్‌సీపీ నాయకులు పాలడుగు నాని, సర్పంచి తొమ్మండ్రు బుజ్జి పాల్గొన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం

ఆగిరిపల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఎస్ఏ పేటలో రూ.10.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను, నేక్కలం గొల్లగూడెం లోని సుందరయ్య నగర్‌లో రూ.11 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లను, కనసానపల్లిలో రూ.36 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ప్రారంభించారు. ఈదులగూడెంలో రూ.62.20 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న ఇంటింటికీ కుళాయి పథకానికి శంకుస్థాపన చేశారు. రూ.39.75 లక్షలతో నిర్మించిన పీఏసీఎస్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ భారీ భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈదులగూడెంలో రూ.2 కోట్లతో ప్రభుత్వ భవనాలు నిర్మించామన్నారు. డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.25 కోట్లు గ్రామ ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, కేడీసీసీ బ్యాంక్ ఏజీఎం దేవేంద్ర, వైస్ ఎంపీపీ కొండ వరదల రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఈలప్రోలు సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, ఎంపీడీవో శామ్యూల్, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనా కుమారి, నాయకులు ఎస్ఎస్ దిలీప్, రాఘవరపు సురేష్, గోళ్ల ఇస్సాకు, నండూరు భాస్కర్ ప్రసాద్, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ మరియమ్మ పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

నూజివీడు: ఎన్ని పార్టీలు జతకట్టినా ప్రజాదరణ మెండుగా ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఢీకొట్టలేరని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బుధవారం రాత్రి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించారు. చైర్‌పర్సన్ కంబాల కృష్ణవేణి, వైస్ చైర్మన్‌గా బర్మా సీతారామయ్యలతో పాటు డైరెక్టర్లను ఏఎంసీ సెక్రటరీ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ నూజివీడు ఏఎంసీ చరిత్రలో తొలిసారి ఎస్సీ మహిళకు చైర్‌పర్సన్ పదవిని కేటాయించామన్నారు. నూజివీడులో స్థానికేతరులకు స్థానం లేదని, ఎమ్మార్ అప్పారావు దగ్గర నుంచి ఇప్పటి వరకు కూడా స్థానికులకే ప్రజలు పట్టం కట్టారన్నారు. నూజివీడు ప్రాంతాన్ని ఇతరుల నుంచి కాపాడుకోవాలన్నారు. పెనమలూరు నుంచి నూజివీడు వచ్చిన కొలుసు పార్థసారథిది బూర్జువా, పెత్తందారీ మనస్తత్వమని కేడీసీసీబీ చైర్మన్ తాతినేని పద్మావతి ధ్వజమెత్తారు. ప్రమాణ స్వీకారానికి ముందు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారుల్లో వందలాది బైక్‌లు, కార్లు, ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ టాప్‌లేని జీపుపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, ఎంపీపీలు కొండా దుర్గాభవాని, ఆరేపల్లి శిరీష, గోళ్ల అనూష, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కలగర వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పట్టణ, ముసునూరు మండలాల అధ్యక్షులు శీలం రాము, మూల్పూరీ నాగవల్లేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



వలంటీర్లను సన్మానిస్తున్న సర్నాల తిరుపతిరావు

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటివద్ద అందజేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు అన్నారు. బుధవారం కె.తాడేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను నెలకొల్పి వలంటీర్ల ద్వారా సేవలను సత్వరమే అందించడం ఆదర్శనీయమన్నారు. గ్రామంలోని 34 మంది వలంటీర్లకు అవార్డులను అందజేసి శాలువాలతో సత్కరించారు. గ్రామ పార్టీ కన్వీనర్ ఎల్‌పీవీ వర్మ, ఎంపీటీసీ సభ్యురాలు చప్పిడి వెంకటదుర్గ, పార్టీ నాయకులు పి.శ్రీనివాసరావు, కె.రాంబాబు, రాజులపాటి వెంకటేశ్వరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.మురళీమోహనరావు, సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు నగదు ప్రోత్సాహకాలను మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు అందజేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి..



వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న స్వామిదాసు

తిరువూరు: స్థానిక నగర పంచాయతీలోని 17వ వార్డులో తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీని వీడిన 20 కుటుంబాలు పమ్మి రాము, పులిపాటి ప్రసాద్, షేక్ జానీల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సభ్యత్వం స్వీకరించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రత్యేకాధికారి వెంకటలక్ష్మి

తోటమూల(గంపలగూడెం): గంపలగూడెం మండలం తోటమూల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2024–25వ సంవత్సరంలో 6, 11 తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని విద్యాలయం ప్రత్యేక అధికారి మోక్షగుండం వెంకటలక్ష్మి బుధవారం తెలిపారు. విద్యాలయంలో ఆరవ తరగతిలో 40 సీట్లు, 11వ తరగతి (ఇంటర్ ప్రథమ సంవత్సరం)లో 40 సీట్లు (ఎంపీసీ (గ్రూపు) భర్తీ చేస్తామన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, అభాగ్యులు, చదువు మధ్యలో మానేసిన వారు (డ్రాప్ అవుట్స్), బడి బయట విద్యార్థులు, పేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, దారిద్ర్యరేఖకు దిగువ (బీపీఎల్) ఉన్న కుటుంబాల వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు. కుటుంబ ఆదాయం పట్టణాల్లో రూ.1.40 లక్షలు గ్రామాల్లో రూ.1.20 లక్షలలోపు ఉండాలన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



ఈదరలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న నాయకులు

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర గ్రామంలో బుధవారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నపనేనివేణు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు సత్యంబాబు, గోళ్ల ఇస్సాకు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాలలో భాగంగా అర్హులైన పేదలకు ఇల్లు ఇస్తాను అని ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి లబ్ధిదారులంతా అండగా నిలబడాలని కోరారు. సీతారాంపురం సర్పంచ్ అత్తి మురళి, కాపు సంఘంనాయకులు రామి శెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు పామర్తి అనిల్, దొండపాటి వీరస్వామి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం

చాట్రాయి: రాజకీయలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేశారని మండలంలోని ఆరుగొలనపేట సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక గ్రామంలో ఇంటింటా నిర్వహించిన 'చెప్పాడంటే.. చేస్తాడంతే' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలు జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారని ఆయన చెప్పారు. అనంతరం సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేసారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చాట్రాయి: మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని మండల ఐద్వా అధ్యక్షురాలు లింగోజు సరిత తెలిపారు. బుధవారం మండలంలోని పోలవరంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకున్న సంఘటనలు చాలా ఉన్నాయని ఆత్మ విశ్వాసంతో మహిళలు ఏ పనైనా సాధిస్తారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు అక్కిరాజు శ్యామల, ఎల్ ప్రసన్న, మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పాల్గొన్నారు.

అశ్వగంధ సాగుతో అధిక లాభాలు

ముసునూరు: అశ్వగంధ సాగును చేపట్టడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని సూరేపల్లి సచివాలయం వద్ద బుధవారం సీనియర్ శాస్త్రవేత్తలు నాగలక్ష్మి, అపర్ణ రైతులకు అశ్వగంధ పంట సాగు విధానం మెలకువలు, జీవన ఎరువుల ప్రాధాన్యంపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. రైతులు అశ్వగంధ పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడంతోపాటు, సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధారాణి, కార్యదర్శి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

100 మంది రోగులకు నేత్ర పరీక్షలు

తిరువూరు: నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ ఆసుపత్రి సహకారంతో తిరువూరు సత్యసాయి సేవా మందిరంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 100 మంది రోగులకు నేత్ర పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ జెమ్మడ్ షాహిన్ నేత్రాల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగించవద్దని, చీకటిలో టీవీ చూడవద్దని సూచించారు. శస్త్రచికిత్స అవసరమున్నవారిని నూజివీడు తరలించారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ దామెర ప్రభాకరరావు పర్యవేక్షించారు.

16న హుండీ కానుకల లెక్కింపు

నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో త్వరలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆలయంలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 16వ తదీన లెక్కిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఎస్‌వీ సాంబశివరావు బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అధికారులు సమక్షంలో కానుకలు లెక్కిస్తామన్నారు.

16న కంటి వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: స్థానిక వీటీపీఎస్ పోస్టాఫీస్ ప్రాంగణంలో ఈ నెల 16న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ గౌరవ అధ్యక్షుడు రజనీకాంత్‌శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన ప్రముఖ కంటి శస్త్ర నిపుణలు బషీర్ అహ్మద్ కంటి పరీక్షలు నిర్వహిస్తారు. ఇబ్రహీంపట్నం తపాలా శాఖ ఆధ్వర్యంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. వీటీపీఎస్ ప్లాంట్ సిబ్బంది, కార్మికులు, కాలనీ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్‌లో కంటి శుక్లాలతో సహా అన్ని దృష్టి దోషాలు పరీక్షించి, ఉచితంగా మందులు, డ్రాప్స్ అందజేస్తారన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పాటిమీద ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. 200 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాతల సహకారంతో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఆలయ ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు తెలిపారు. వేద పండితులు గోపీ, పవన్, ఆలయ అర్చకులు రామకృష్ణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, శ్రీమాన్ విఠలాచార్యులు ఆధ్వర్యంలో బాలాలయ ప్రతిష్ఠ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి నిర్వహించారు. దేవాలయ శిల్పి రాయల ఆదినారాయణ పర్యవేక్షణలో నిర్మాణ పనులు జరగనున్నాయి.

పాడి పరిశ్రమతో రైతులకు మేలు

రామానగరం(విస్సన్నపేట): రైతులకు పాడిపరిశ్రమ రైతులకు ఆదాయ మార్గంగా ఉంటుందని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. మండలంలోని పుట్రేల పంచాయతీ రామానగరంలో పాలసంఘాలను బుధవారం సందర్శించారు. యువత ఎక్కువ పాడిపరిశ్రమ వైపు మొగ్గుచూపుతున్నారన్నారు. రైతులకు ఉచితంగా కల్యాణమస్తు, క్షీరబంధు వంటి పథకాలు అందజేస్తున్నామన్నారు. జిల్లా పాలక సభ్యురాలు ఎస్.వాణిశ్రీ, జిల్లా యూనియన్ ట్రస్ట్ బోర్డు మెంబర్ పి.సత్యనారాయణ, పుట్రేల అధ్యక్షురాలు వనజ, చిల్లింగ్ సెంటర్ మేనేజర్ సాంబశివమూర్తి పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

జి.కొండూరు: విద్యుత్ స్తంభం ఏర్పాటు విషయంలో ఇరువర్గాల మధ్య తలెత్తిన వివాదం దాడికి దారితీసింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్తే.. మండలంలోని మునగపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభం ఏర్పాటులో పత్తిపాటి ఉదయకిరణ్, చీలి బాబాబురావు కుటుంబాలకు బుధవారం సాయంత్రం వివాదం తలెత్తింది. ఈ వివాదం తీవ్రమై ఇరు కుటుంబాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో చీలి బాబూరావుకి, పత్తిపాటి ఉదయ్‌కిరణ్‌కి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించిన ఇరు కుటుంబాలు, ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షబ్బీర్ అహ్మద్ తెలిపారు.

ప్రశాంత ఎన్నికలే పోలీసుల లక్ష్యం

రెడ్డిగూడెం: రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా కృషి చేస్తామని మైలవరం సీఐ కే కిషోర్‌బాబు అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన అన్నేరావుపేట, అన్నేరావుపేట తండా, సీతారామపురం గ్రామాల్లో బుధవారం కేంద్ర సాయుధ బలగాలు, పోలీసు సిబ్బందితో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలు, రాజకీయ పార్టీలు ఎన్నికలు ప్రశాంతం జరిగేందుకు సహకారం అందించాలన్నారు. ఎస్ఐ గోవింద్, పోలీసు సిబ్బంది, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

చాట్రాయి: మర్లపాలెంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణ 3 నెలల పాటు నిర్వస్తామని ఈ శిక్షణ మహిళల ఆర్థిక ఎదుగుదలకు ఉపయోగపడుతుందని ఫౌండేషన్ సభ్యులు నరుకుళ్ల అజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెల్ది సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

ముసునూరు: పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పనులన్నీ తక్షణం పూర్తి చేయాలని డ్వామా పీడీ ఏ రాము ఆదేశించారు. ముసునూరులో ఎంపీడీఓ పద్మావతీదేవి అధ్యక్షతన ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం చింతలవల్లిలోని పంట నీటి కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు, ఉపాధి హామీ పనుల నాణ్యత, 100 రోజులు పని పూర్తి, మస్టర్ రిజిస్టర్లో కూలీల సంతకాలు తదితర అంశాలను తనిఖీ చేశారు. ఏపీఓ రోజ్‌లీల, ఈసీ జయప్రసాద్, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

తిరువూరు: స్థానిక అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. ఐదేళ్లలోపు లోపు పిల్లలకు వార్డు సచివాలయాల్లో ఆరోగ్య కార్యదర్శులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు టీకాలు వేశారు. తట్టు, కంఠసర్పి, కోరింత దగ్గు, పోలియో, మెదడు వాపు, నిమోనియా, ధనుర్వాతం వంటి వ్యాధులు రాకుండా విధిగా ప్రతి చిన్నారికి ఈ టీకాలు వేయించాలని వైద్యాధికారులు బేగం, భానుతేజ సూచించారు.